జీవించటం తపస్సు. మన ఇంట్లో మనం ఉండవచ్చు, మన డ్యూటీ మనం చెయ్యవచ్చు, కాని అది మమకార రహితంగా ఉండాలి. వ్యక్తిభావన లేకుండా చేయాలి. మనం వ్యక్తి భావన తగ్గించుకోవాలి, సమిష్టిభావన పెంచుకోవాలి. భగవాన్ ఒకమాట చెప్పారు. నామరూపాలకు ఆధారంగా ఏ వస్తువు అయితే ఉందో ఆ వస్తువును చూడకుండా, ఆ వస్తువును ప్రేమించకుండా మీ ప్రేమను కేవలం ఈ రూపానికి, నామానికి కనుక పరిమితం చేస్తే ఎప్పటికయినా పడరాని కష్టాలు, పడరాని నష్టాలు, పడరాని దుఃఖాలు ఆ రూపం, నామం మీకు తెచ్చిపెడుతుంది. ఇవి ఒక మనిషి చెప్పిన మాటలు కాదు, చైతన్యం నోరుపెట్టుకొని మాట్లాడుతోంది. మీ అమ్మాయిని మీరు ప్రేమిస్తున్నారు అనుకోండి, ఎప్పటికయినా మీ అమ్మాయి శత్రువు అయ్యింది అనుకోండి, ఆ సంతోషం అంతా దుఃఖం కింద మారిపోతుంది. రూపబుద్ధికి, నామబుద్ధికి మీరు కట్టుబడి ఉన్నంతకాలం, వాటికే మీరు పరిమితమై ఉన్నంతకాలం మీ ప్రేమలు, అనుబంధాలు, ఆకాంక్షలు అన్నీ రెట్టింపుకు రెట్టింపు వడ్డీతోసహా దుఃఖం కింద మారిపోయి తిరిగి మీకే వస్తాయి. భగవాన్ చెప్పిన మాటలు మనం వినటానికి చేదుగా ఉండవచ్చు కాని అది అల్టిమేట్ ట్రూత్. మీ ఇంట్లో వ్యక్తులను మీరు ప్రేమించండి, అది డ్యూటీ అనుకొని చేయండి. ప్రపంచంలో అనేక జీవకోటి ఉంది, వారిలో కొందరిని భగవంతుడు మీ ఇంటికి కేటాయించాడు. వారు భగవంతుడు తరపున వచ్చారు. వారిని భగవంతుడు మనకు కేటాయించాడు అనుకొని మీరు డ్యూటీ చేయండి అంతే. గురువు నీకు బయట నుండి ఏమీ తెచ్చి ఇవ్వడు. నీ స్వరూపం నీకు ఎరుకలో లేదు. నీ స్వరూపం నీకు ఎరుకలోనికి రాకుండా ఏవైతే ఆటంకాలు ఉన్నాయో వాటిని తొలగిస్తాడు, వాడే గురువు. మీకు అహంకారం తలకెక్కిపోయి ఉంది అనుకోండి, దానిని ఎలా తొలగించాలి, ఎప్పుడు తొలగించాలి ఆ ముహూర్తం ఆయన పెట్టుకొని, ఒక ప్లాన్ ప్రకారం దానిని తొలగిస్తాడు, దానినే డివైన్ ప్లాన్ అంటారు. అనుకొనేది జీవుడిసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. భగవంతుడు సత్యసంకల్పుడు. మనం అనుకొనేవి జరగవు కాని భగవంతుడు ఏదైనా అనుకొంటే జరగవలసిందే.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-01-05, కాపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే కర్మఫలాన్ని ఆశించినా, ఆశించక పోయినా ఫలం వస్తుంది. కర్మఫలాన్ని నీవు ఆశించటం వలన బంధింపబడతావు, కర్మఫలాన్ని

ఆశించకుండా కర్మ చేయటం వలన నీకు మోక్షం వస్తుంది. కర్మ మనలను బంధిస్తుంది, అది మనలను విడుదల చేస్తుంది కూడా, రెండు గుణాలు దానిదగ్గర ఉన్నాయి. కర్మఫలాన్ని ఆశిస్తే బంధింపబడతావు, కర్మచక్రంనుండి విడుదలపొందలేవు, నీకు మిగిలేది అశాంతి, కర్మఫలాన్ని ఆశించకుండా చేయటంవలన మనం అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి విడుదలపొందుతాము, మనకు మోక్షం వస్తుంది. మనిషిని ప్రేమస్తే అది మీకు తాత్కాలికంగా రుచిగా ఉన్నా పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది, మీకు అశాంతిని తీసుకొనివస్తుంది. అదే ప్రేమ మనం భగవంతుడి మీద పెడితే మీకు శాంతి కలుగుతుంది, మోక్షం కలుగుతుంది. ఉన్నది భగవంతుడు ఒక్కడే, ఆయనకు భిన్నంగా ఏమీ లేదు. ఇది ముందు మనకు అర్థమవ్వాలి. అంతా భగవంతుడే అని మనకు అర్థమవుతూ ఉంటే మనం ఆయనను ఆశ్రయిస్తాము, ఆయనమీద గౌరవం, భక్తి పెరుగుతుంది, ఆయనను ఆరాధిస్తాము, మేము చాలా తెలివైనవారము అని చాలామంది అనుకుంటూ ఉంటారు. మనం తెలివైనవారమో, కాదో మనకు గుర్తు ఏమిటి అంటే భగవంతుడు చెప్పిన వాక్యాన్ని మనం ప్రమాణంగా తీసుకొంటే మనం తెలివైనవారము అని అర్థం. అలాకాకుండా మనం భగవంతుడు చెప్పిన వాక్యాన్ని ప్రమాణంగా తీసుకోము అనుకోండి, దాని మీద మనకు విశ్వాసం కుదరటంలేదు అనుకోండి మనం తెలివి తక్కువ వారము అని అర్థం. మనకు పుణ్యబలం ఉంటే, పూర్వజన్మలలో పుణ్య కర్మలు చేసి ఉంటే, స్వార్థం లేకుండా పనిచేసి ఉంటే మనకు భగవంతుడియందు విశ్వాసం కలుగుతుంది. ఇది కలియుగం, ఈయుగంలో మంచిమాటలు మాట్లాడేవారు, మంచి పనులు చేసేవారు చాలా తక్కువమంది ఉంటారు, అది ఈయుగం యొక్క ప్రభావం. అందుచేత మన పెద్దలు ఏమని చెపుతున్నారు అంటే మీరు పెద్దపెద్ద యజ్ఞాలు, యాగాలు చేయనక్కరలేదు, ఈకలియుగంలో నామం చేసుకొన్నాచాలు మీరు తరిస్తారు అంటున్నారు. మామటుకు మేము పెద్దతపస్సులు ఏమీ చేయలేదు, కాని గురువు పట్ల మాకు ఉన్న అత్యంత అనురాగం, హద్దులులేని ప్రేమ వలన మాకు ఏదైనా జ్ఞానం వస్తేవచ్చింది, అది మా కృషికాదు, ఆయన ఇచ్చిన వరం. ఎప్పుడయితే మేము భగవాన్ మార్గంలోనికి వచ్చామో అప్పటినుండి భగవాన్ రూపం, భగవాన్ నామం, భగవాన్ టీచింగ్‌ను అంటిపెట్టుకొని ఉండిపోయాము. మాకు ఏదైనా వస్తే దానిఫలితంగానే వచ్చింది, అంతకంటే అదనంగా మేము చేసింది ఏమీలేదు. ఈసృష్టిలో వారు పురుషులు అయినా, స్త్రీలు అయినా, వారు ఏమతస్తులయినా, ఏకులస్థులయినా, వారు ఏనక్షత్రంలో జన్మించినా, ఎప్పుడు మరణించినా పవిత్రమైన మనస్సు

లేనివాడికి, ఏకాగ్రమైన చిత్తము లేనివాడికి ఈశ్వరానుభవం కలిగే అవకాశంలేదు. కృష్ణుడు గురించి ఒకరు పాట వ్రాసారు. కృష్ణా నీవే నాతల్లివి, నీవే నాతండ్రివి, నాతోడు నీడనీవే, నాభర్తవునీవే, నామోక్షానివి కూడా నీవే కృష్ణా. ఒకవేళ అబద్ధాలు చెపుతున్నాను అనుకొంటున్నావేమో, నిజము కృష్ణా నిజము అని వ్రాసారు. అది శరణాగతి భావన, ఆశరణాగతిలో అన్ని వస్తాయి, మోక్షంకూడా వస్తుంది. ఏది ఆత్మ, ఏది అనాత్మ అని వేరుచేసుకొనే ఆ వివేకం, తెలివి, బుద్ధిసూక్ష్మత ఉన్నవాడు ఏస్థితిని పొందుతాడో శరణాగతి వలన కూడా అదేస్థితిని పొందుతాడు. పూర్వకాలంకంటే ఇప్పడు టెక్నాలజి పెరిగినా ప్రేమభావన తగ్గిపోయింది. మన హృదయంలో ప్రేమలేకుండా ప్రేమస్వరూపుడైన ఈశ్వరుడు మనకు ఎరుకలోనికి రాడు. మనం ఏపని చేసినా చేసేది నేను కాదు భగవంతుడే ఈదేహం ద్వారా చేయించుకొంటున్నాడు అనే భావనతో మనం పనిచేస్తూ ఉంటే అది ధ్యానం అవుతుంది. నేను మీతో ప్రేమగా మాట్లాడుతూ ఉంటే, మీరు బాగుపడాలని మాట్లాడుతూ ఉంటే అది కూడా ధ్యానం అవుతుంది. ధ్యానం అంటే ఒక చోటకూర్చొని పూసలు లెక్కపెట్టుకోవటం కాదు. మీరు చేసుకొనేది విడిచిపెట్టకండి, అదనంగా మీరు ఇది కూడా కలుపుకోండి. మనకు అపేక్ష ఉంటే ఏదైనా వస్తుందేమో, అపేక్ష లేకపోతే వచ్చేది రాదేమో అనుకొంటాము. ఈశ్వరుడు నీకు కేటాయించిన దానిని బట్టి అది నీకు వస్తుంది కాని కోరికను బట్టి ఏదీ రాదు. వచ్చేది ఆగదు రానిది ఎవరు ఎంత ప్రయత్నంచేసినా రాదు.

మన శరీరం బాగా ఉండాలి, అందంగా ఉండాలి, శుచిగా ఉండాలి అని మనం అనుకుంటాము, మంచిదే కాని మీశరీరం ఎంత శుచిగా ఉండాలి అని మీరు అనుకొంటు న్నారో అలాగే మీమనస్సు కూడా అంత శుచిగా ఉండాలి అని మరిచిపోవద్దు. కుండను బయట తోమేసి లోపల తోమకపోతే ఎలాగ ? కుండలోపల కూడా తోమాలి. బయట శుచి, లోపల శుచి రెండూ అవసరం. మీచూపులో దోషం ఉండకూడదు, ద్వేషం కనబడకూడదు. మీచూపులను నేను చూస్తూ ఉంటే నాకు మోక్షం రావాలి అంత చల్లగా మీచూపులు ఉండాలి. మనం చూడదగినవాడు జ్ఞాని, ఆయనను దర్శనం చేసేకొలది చేయాలనిపిస్తుంది. షేక్స్పియర్ ఏమని చెప్పాడు అంటే ఈ ప్రపంచం అనేది ఒక స్టేజి. మనం ఎక్కడ నుండి వచ్చామో మనకు తెలియదు, కొంతకాలము ఇక్కడఉండి మరల ఎక్కడికోపోతాము, అది కూడా మనకు తెలియదు, సమాజానికి తెలియదు. ఈ ప్రపంచంలో అందరూ ఒక పని చేయరు, రకరకాల పనులు చేస్తూ ఉంటారు. ఈ ప్రపంచం అనే

నాటకంలో ఎవరిపాత్ర వారు పోషిస్తారు: భగవంతుడు ఈ శరీరాన్ని ఎలా ఆడించాలి అనుకొన్నాడో అలా ఆడిస్తాడు, నాటకం అయిపోయిన తరువాత ఎక్కడికో పోతాము. కొత్తవారు వస్తూ ఉంటారు, పాతవారు పోతూ ఉంటారు. ఇదంతా ఒక నాటకం, ఇది నాటకం అని తెలుసుకొని మీరు నటించండి అంటున్నాడు షేక్స్పియర్. ఈ దేహం నిజం కాదు, మనం ఒక వేషం వేసుకొని ఇక్కడకు వచ్చాము. ఈ దేహం పోయిన వెంటనే ఆ వేషం పూర్తి అయిపోతుంది, మరల ఇంకో వేషం వేయటానికి వేరే దేహంలో ప్రవేసిస్తాము. చనిపోయేవారు చనిపోతున్నారు, పుట్టేవారు పుడుతున్నారు, వేషాలు వేస్తున్నారు, కష్టాలు పడుతున్నారు. ఎన్నో వేదనలతోటి, రోదనలతోటి కనిపిస్తున్నటువంటి ఈ లోకం సుఖాలయం కాదు, ఇది దుఃఖాలయం అంటున్నాడు పరమాత్మ. నువ్వు విచారణ చేసిచూస్తే ఏముంది ఈ లోకంలో, దుమ్ము తప్ప ఏమీ లేదు. మనం కోతికి కూడా గురువు వేషంవేయవచ్చు. కాని మనం వేషంవేసినా అది కోతి లానే ప్రవర్తిస్తుంది కాని గురువులాగా ప్రవర్తించలేదు. ఒక్క జ్ఞాని మాత్రమే గురువు, ఆత్మానుభవం పొందినవాడు మాత్రమే గురువు. జ్ఞానసముపార్జన లేకుండా, సత్యానుభవం లేకుండా నీవు జననమరణచక్రంనుండి విడుదలపొందలేవు. అసత్యానికి పరిమితులు ఉంటాయి. సత్యానికి పరిమితులు లేవు, సత్యం అంతటా ఉంటుంది, అది లేనిచోటు అంటూలేదు. సత్యానుభవం పొందటానికి నీ మనోదేహములను మేగ్జిమమ్ ఉపయోగించుకో, నీదేహయాత్ర సాగటానికి ఇతరుల మీద ఆధారపడవద్దు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా, ప్రేమగా చెయ్యి. మాకు భగవాన్‌కు ఒక తేడా ఉంది. మేము మాట చెప్పాలి కాని భగవాన్ మాటలు చెప్పనక్కరలేదు. మాటలు చెప్పకుండానే మౌనంతో పనిచేస్తూ ఉంటాడు. మౌనంతో పనిచేసేశక్తి మాకు ఇంకా రాలేదు కాబట్టి మాటలు చెపుతున్నాము, లేకపోతే మాటలతో పనిలేదు. రామకృష్ణుడు, రమణుడు పైకి మీకు మొద్దులు కింద కనబడవచ్చు. కాని వారు పొందిన జ్ఞానం, ఆహృదయశక్తి రాంగ్ డైరక్షన్‌లో వెళుతున్న లోకాన్ని రైట్ డైరక్షన్ లోనికి తిప్పుతూ ఉంటుంది, ఆహృదయశక్తి అట్టిది. మేము ఇలా చేస్తున్నాము, మిమ్మల్ని ఉద్ధరిస్తున్నాము అని వారు చెప్పరు. మీకు నుయ్యి తవ్వుతున్నాము, కాలువ తవ్వుతున్నాము అంటారు ఎందుకు ఈగోల అంతా. చేసేటప్పుడు చెప్పటం ఎందుకు? నిజంగా మనకు ప్రజలను ఉద్ధరించే ఉద్దేశం ఉంటే చెప్పటం ఎందుకు? చేసేయటమే. మీమనస్సు అణిగిపోయినపుడు, మాట అణిగిపోయినపుడు ఒక మహామౌన స్థితిని మీరు అనుభవిస్తారు. ఆ మౌనం అతిశక్తివంతమైనది, దానిద్వారా పనిజరిగిపోతూ ఉంటుంది. ఏదో మీరు ముచ్చటపడుతున్నారని ఈ మాటలు చెపుతున్నాము కాని మాటలతో

పనిలేదు, మౌనంలో వర్ణించటానికి వీలులేని యాక్టివిటి జరిగిపోతూ ఉంటుంది. నీ దేహం శుచిగా ఉండాలి, మాట శుచిగా ఉండాలి, చేత శుచిగా ఉండాలి, మనస్సు శుచిగా ఉండాలి. నీకు తపస్సు లేకపోతే, నీలో వైరాగ్యం కనుక లేకపోతే నీమాట, చేత శుచిగా ఉండవు. కొంతమందికి ఏదైనా పని చెప్పాము అనుకోండి, దానిని పాడుచేసివస్తారు. తెలియక చెప్పాము మనమే వెళ్ళి ఆ పని చేసుకొంటే సరిపోను అని మనకు అనిపిస్తుంది. మీరు ఏదైనా పని చేసేటప్పుడు ఒక్క నేర్పు ఉంటే సరిపోదు, ఓర్పుగా చేయాలి. మనిషి అయ్యాక మనం అంటే ఇష్టపడేవారు ఉంటారు, ఇష్టంలేనివారు ఉంటారు, అది సహజం, దానికి ఆశ్చర్యపడనక్కరలేదు. నువ్వు ఎలాగ ఉండాలి అంటే ఏదో పక్షం వహించకుండా ఉదాసీనంగా ఉండు. శరీరానికి పక్షవాతం ఎంత చెడ్డదో మనస్సుకు పక్షపాతం అంతే చెడ్డ. కుక్కతోకవంకర ఎంత సహజమో, లోకంలో అనేక వంకరలు ఉంటాయి, అది సహజం. లోకంలో శత్రువులు ఉంటారు, మిత్రులు ఉంటారు, నింద ఉంటుంది, స్తుతి ఉంటుంది, రజోగుణం కలవారు ఉంటారు వీటి అన్నింటికి మధ్యలో నీవు ఉదాసీనంగా ఉండాలి. భగవంతుడు అంటే ఎవడు అంటేసూర్యుడికి కాంతినిచ్చే శక్తిని ఎవడు ఇచ్చాడో, చంద్రుడికి చల్లదనాన్ని ఇచ్చే శక్తిని ఎవడు ఇచ్చాడో, గ్రహాలకు, నక్షత్రాలకు శక్తిని ఎవడు ఇచ్చాడో, రమణుడికి జ్ఞానాన్ని ఎవడు ఇచ్చాడో వాడే ఈశ్వరుడు, వాడే వాసుదేవుడు, వాడే భగవంతుడు, కనిన జననికన్న ఘన దయాదాయకా ఇదియా నీ అనుగ్రహము అరుణాచలా । అది భక్తులు అనుభవిస్తారు కాని లౌకికులు ఎలా అనుభవించగలరు, ఆ ప్రేమ అనుభవించిన వారికి తెలుస్తుంది. ఈ రాళ్ళకా బోధ అంటారు పరమహంస, మన ఊరిలో ఉన్న చెరువులో రాతిని పది సంవత్సరాలు పెట్టినా అది ఒక్క నీటి చుక్క కూడా లోపలకు తీసుకోదు, అటువంటి రాళ్ళకా ఈబోధ అంటాడు రామకృష్ణుడు. చాలామంది సాధన చేస్తూ ఉంటారు, బాధపడుతూ ఉంటారు. సాధన పేరుమీద ఇసుమంతయు బాధలేకుండా నన్ను అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుతురులోనికి తీసుకొనివచ్చి, శాంతిసామ్రాజ్యానికి అధిపతిని చేసావు అరుణాచలా అంటారు భగవాన్. ఎవరిని చూసినా ఏదోరకమైన బెంగపెట్టుకొంటున్నారు. ఏదో వెలితి, ఏదో కొరత, నోటితో చెప్పటానికి వీలులేని అశాంతితో ఉంటున్నారు. ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీకు ఏదైనా బెంగ వస్తోంది అనుకో, అది అరుణాచలేశ్వరుడికి తెలియకుండా రావటంలేదు, ఇది అంతా ఆ పెద్దాయనకు తెలుసు. ఆ బెంగను, కష్టాలను కావాలనే ఆయన పంపుతున్నాడు, నీకాళ్ళమీద నువ్వు నిలబడేటట్లు చెయ్యటానికే అన్నీ చేస్తున్నాడు, ఇది గుర్తించినవారు ధన్యులు. ఇదంతా

అరుణాచలేశ్వరుడు చేసే చేష్ట. భక్తుల ద్వారా మాకు వచ్చే బాధలు చెపుతున్నాను. మాయింటికి రోజూ సాయంత్రం నాలుగు గంటలకు కొంతమంది భక్తులు వస్తారు. వారింట్లో ఉన్న పురుషులు ఏమని కబురు పంపిస్తున్నారు అంటే నాన్నగారు మిమ్మల్ని చూడటానికి వారానికి ఒకసారి రావచ్చు, మీటింగులకు వెళ్ళవచ్చు, కాని రోజూ వచ్చేస్తునారు మీరు కొంచెం చెప్పవచ్చుకదా అంటారు. అది వారే చెప్పవచ్చుకదా, వారు చెపితే ఎదురు తిరుగుతారేమో ఇంట్లో పేచీలు రాకూడదు మనం పేచీలు పడాలి అంటే వారు ఎంత తెలివైన వారో చూడండి. వారు డబ్బు సంపాదించుకొంటున్నారు, వీరు జ్ఞానం సంపాదించుకొంటున్నారు, నిష్టూరాలు మాకు, ఇవి మాకు వచ్చే సమస్యలు. ఈ మాటలు అన్నీ మరిచిపోండి, ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవే, వాటిని వదిలేయండి, మీరు ఆత్మస్వరూపులు. జరిగిపోయిన గొడవలను తలపెట్టుకోవద్దు. వాటిలో నుండి పాఠాలు నేర్చుకోండి. భవిష్యత్ గురించి గాలి మేడలు కట్టవద్దు. వాస్తవపరిస్థితులకు దగ్గరగా ఉండండి. జరిగిపోయినగొడవల నుండి ఏ పాఠాలు అయితే నేర్చుకొన్నారో వాటిని భవిష్యత్‌లో ఉపయోగించుకోండి, మీరు గతంలో జీవించవద్దు, భవిష్యత్తులో జీవించవద్దు, వర్తమానకాలంలో జీవించండి. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. ఆదిలేదు, అంతంలేదు, ఎప్పుడూ ఉండేవాడే అనంతుడు. వర్తమానకాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ అనంతుణ్ణి పట్టుకోండి. గురువు లేకుండా వస్తువు దొరుకుతుందా అంటాడు వేమన. తాళంచెవి లేకుండా తలుపు తీయలేరు, గురువు లేకపోతే గుర్తు తెలియదు. నువ్వు పనిచెయ్యి, కర్తృత్వబుద్ధి లేకుండా చెయ్యి. నావలననే అవుతోంది అని పొగరుబోతుతనంతో చేయవద్దు. కర్తలేని కర్మను చెయ్యి. కర్తతో కూడిన కర్మను చేసావా, నేను చేస్తున్నాను అనే భావనతో చేసావా అది నిన్ను వెంటాడుతుంది, ఎత్తుకు ఎత్తు నువ్వు అనుభవించాలి. మీశరీరం ద్వారా ఏదయినా మంచి జరిగింది అనుకోండి అది భగవంతుడే చేసాడు, అదిమీకు తెలియదు మీరు చేసారు అనుకొంటున్నారు, ఆ పాడుబుద్ధిని విడిచిపెట్టండి. మీ బొమ్మలకు ఏదైనా గౌరవం వచ్చే యోగం ఉంది అనుకోండి, భగవంతుడే ఆ పనిని చేసేసి ఆ గౌరవాన్ని ఈ బొమ్మకు ఆరోపిస్తాడు, పని చేసేది భగవంతుడు, గౌరవం మీకు. అందుచేత కర్తలేని కర్మను ఆచరించు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఈ బంధము, మోక్షము, ముక్తి వీటిని తీసి ప్రక్కన పెట్టండి. బంధముక్తులులేని ఆత్మశాంతిని, ఆత్మసుఖాన్ని జుర్రుకోండి, దానిని అనుభవించండి అంటున్నారు, ఎక్కడికో చిటారుకొమ్మకు తీసుకొని పోతున్నారు. కళ్ళుఉన్నవారు చూడండి, చెవులు ఉన్నవారు వినండి. అక్కడ ముక్తి గొడవలేదు, బంధంగొడవ లేదు, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా

ఆనందమే. ఆ ఆనందాన్ని, సుఖాన్ని, శాంతిని అనుభవించండి అంటున్నారు. మనం జాగ్రదవస్థలో కోపాలు, తాపాలు, ద్వేషాలు ఇవి అన్ని అనుభవిస్తున్నాము. ఇవి కాదువయ్యా నీవు అనుభవించేది, బంధము కాని, మోక్షంకాని స్మరణే లేని సుఖాన్ని, శాంతిని, ఆనందాన్ని అనుభవించు అంటున్నారు రమణభగవాన్. హృదయం ఖాళీ అయినవాడికి కాని భగవంతుడు ఆయన స్వరూపాన్ని ఇవ్వడు. నేనేదో పుణ్యం చేసుకొన్నాను అనుకొనేవాడు జీవుడు, దానిని అనుభవించేవాడు జీవుడు, అనుభవిస్తున్నాను అని పొంగి పోయేవాడు జీవుడు, ఇట్టివాడికా అమృతానుభవం. కర్తృత్వం పెట్టుకొనేవాడు జీవుడు. దానికి సత్యానికి ఎట్టి సంబంధం లేదు. నువ్వే కల్పించు కొంటున్నావు, నువ్వే బాధపడుతున్నావు. నువ్వేకర్త అనుకొంటున్నావు, నువ్వే భోగిస్తున్నావు, ఇవన్ని చేసేది నువ్వే, నామీద పెడతావు ఎందుకు అంటున్నాడు పరమాత్మ. పుణ్యం చేసుకొనే వాడవు నువ్వే, ఆసుఖం అనుభవించేవాడవు నువ్వే, నాకు సంబంధం ఏమిటి? కర్తృత్వం ఉన్నవాడికి భోక్తృత్వం ఉంటుంది. కర్తృత్వం లేనివాడికి భోక్తృత్వం లేదు. నువ్వు పనిచెయ్యి, యోగివై పనిచెయ్యి అంటున్నాడు పరమాత్మ. యోగివై పని చేస్తే భోగం రాదు, జ్ఞానం వస్తుంది. నువ్వు చేసేపని, నువ్వు మాట్లాడేమాట నీకు మోక్షాన్ని ఇవ్వాలి. నువ్వు కర్తృత్వం పెట్టుకొని పనిచేస్తే భోగం, యోగివై పనిచేస్తే మోక్షం. నీకు భోగం కావాలా, మోక్షం కావాలా ఏది కావాలో నిర్ణయించుకో అంటున్నాడు పరమాత్మ. నేను చెప్పవలసింది చెప్పాను. ఎంజాయ్‌మెంట్ గురించి చెప్పాను, పెర్‌ఫెక్షన్ గురించి చెప్పాను. నీ ఇష్టం నీకు ఎలా బాగుంటే అలా చేసుకో, నాకు ఏమీ అభ్యంతరం లేదు అంటున్నాడు, భగవంతుడి యొక్క గొప్పతనం చూడండి. ఒక ముస్లిం భగవాన్‌ను అడిగాడు. మీరు ఉన్నదంతా ఒక్కటే అని చెపుతున్నారు. మరి ఈ అక్షరమణమాల ఏమిటి? ఈ కొండదేవుడు అని చెప్పటం ఏమిటి? అని అడుగుతున్నాడు. అప్పడు భగవాన్ ఏమన్నారు అంటే ఈ పాట ఆత్మ, దేవుడు ఆత్మ, ఆ కొండ ఆత్మ, చెప్పేవాడు ఆత్మ, అంతా ఆత్మే అన్నారు. కృష్ణుడు ఈ లోకం గురించి రెండు మాటలు చెప్పాడు, అనిత్యం, అసుఖం. అది నిత్యం కాదు, పోనీ పదిఏళ్ళు బతికినా సుఖంగా వెళితే బాగుండును అనుకుంటే అది సుఖం కాదు. ఎక్కడయితే సుఖం లేదో, ఏదైతే నిత్యం కాదో మనం దానికోసం వెతుకుచున్నాము. ఏదైతే సుఖాన్ని ఇస్తుందో, ఏదైతే మన స్వరూపమో అసలు దాని గురించి అన్వేషణ మనకు లేదు. నరుడి మీద ఉన్న ప్రేమ కూడా మనకు నారాయణుడి మీద లేదు. నరుడిని ప్రేమిస్తే నీకు మిగిలేది దుఃఖం. నారాయణుడి పాదాలను ఆశ్రయిస్తే నీకు మోక్షం కలుగుతుంది. మీరందరు విశ్వాసహీనులు,

ఇటువంటి విశ్వాసహీనులకా స్వర్గరాజ్యం అంటున్నాడు ఏసు. మీకు భగవాన్ మాటలు అర్థం కావటం లేదు అనుకోండి, అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి, ప్రేపేర్ అవ్వండి అంతేగాని తిట్టకండి, వాటిని వదిలేయకండి, వాటిని ఊసేయకండి. భగవాన్ చెప్పిన మాటలు మాకు అర్థంకావటం లేదు అనుకోండి అంతేకాని అవి అసత్యాలు అని మటుకు అనుకోవద్దు. భగవంతుడు మనలను ప్రేమించినట్లుగా, ఒక ఋషి మనలను ప్రేమించినట్లుగా మన అమ్మ కూడా మనలను ప్రేమించలేదు. భగవాన్ అనుగ్రహం లేకుండా భగవాన్ చెప్పిన మాటలు మనకు అర్థంకావు, కొమ్ములు తిరిగిన పండితులు కూడా బోల్తాపడతారు. ఎవడో వచ్చి నేను శివుడిని దర్శించాను అని భగవాన్‌తో అంటే దానిని భగవాన్ కాదని అనటంలేదు. నేను శివుడిని చూసాను అంటున్నావు, అంటే నీలోపల చూసేవాడు ఒకడు ఉన్నాడు, శరీరం చూడదు, శరీరం ద్వారా చూసే వాడు ఒకడు ఉన్నాడు. ఆ చూసేవాడు ఎంత నిజమో, ఆ శివుడు కూడా అంతే నిజం అని చెప్పారు. ఒకవేళ ఆయన వరమిస్తాడు అనుకో, ఆ వరం మనస్సు పొందుతుంది అనుకో. నీ మనస్సు ఎంత నిజమో, ఆ శివుడు ఎంత నిజమో, ఈ వరం కూడా అంతే నిజం. ఇవన్నీ సాపేక్షిక సత్యాలే కాని పారమార్థిక సత్యాలు కాదు. ఇది ఫైనల్ కాదు, గమ్యం కాదు. పరమసత్యం వీటి అన్నింటికీ అతీతంగా ఉంది, నువ్వు పొందవలసింది అది, నీ చూపును అక్కడ పెట్టు అంటున్నారు భగవాన్. మనం ఇంట్లో దేవుడి బొమ్మలు పెట్టుకొంటున్నాము. ఆ రూపాన్ని ఆరాధిస్తున్నాము, ఆ నామాల్ని స్మరిస్తున్నాము, దాని వలన నీ మనస్సుకు నిగ్రహం వస్తుంది కాని మనస్సు నశించదు. అణిగిన మనస్సు ఎప్పుడయినా విజృంభించవచ్చు. మనస్సు నశించాలి అప్పుడు నీకు మోక్షం కలుగుతుంది. స్ప్రింగు మంచం మీద మనం కూర్చున్నప్పుడు అది కిందకు దిగుతుంది, మరల మనం లేచినప్పుడు వెంటనే అది పైకి వచ్చేస్తుంది. అలాగే నీవు ఏదైనా రూపాన్ని ఆరాధించినప్పుడు మనస్సు అణుగుతుంది మరల అది బయటకు వచ్చేస్తుంది. మనస్సు చేత చూడబడే దాని కూడా పరుగెత్తటం కాదు, ఈ చూసే మనస్సు ఎవరు? అది ఎక్కడ నుండి వస్తోంది అని ప్రశ్నిస్తూ నీవు లోపలకు చూడటం ప్రారంభిస్తే అది ఎక్కడ నుండి అయితే ఉదయించి వచ్చిందో అక్కడకు వెళ్ళి అణిగిపోతుంది, మనస్సు దాని మూలంలో అణిగినప్పుడు మనస్సు నశిస్తుంది. మనస్సు నశించిన వెంటనే నీ హృదయంలో ఉన్న సత్యం, నీ హృదయంలో ఉన్న పరమాత్మ నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. ప్రతీ జీవుడికి సుఖం కావాలి, సుఖం కోసం వెతుకుచున్నాడు. ఆ సుఖం ఎక్కడ ఉంది అంటే నువ్వు ఏదైతే నేను నేను అంటున్నావో ఆ నేను యొక్క మూలంలోనే సుఖం ఉంది అంటున్నారు భగవాన్. కాని నీవు అక్కడ

వెతకటం మానేసి సుఖం కోసం బయట వెతుకుచున్నావు, ఇలా నీవు కోటి జన్మలు వెతికినా అది నీకు దొరకదు. నేను యొక్క మూలంలోనికి వెళితే అక్కడ ఉన్న సుఖ సముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. భగవాన్‌కు మరణానుభవం ద్వారా మరణంతో ఉన్న సంబంధం తెగిపోయింది, ఇంక అక్కడ నుండి ఆనందం, సుఖం అనుభవిస్తాడు, వాడికి ఎటుచూసినా ఆనందమే, శాంతే. అప్పుడు అరుణాచలేశ్వరుడు ఏమి చేసాడు అంటే అంతా వాడే అనుభవించేస్తున్నాడు అని ప్రజలకు పంచిపెట్టటం కోసం అరుణాచలం తీసుకువచ్చేసాడు. మనకు ప్రతీదీ చూడటం అలవాటు అయిపోయింది కదా, మూలతలంపు మూలాన్ని చూడటానికి ప్రయత్నించండి. మూలతలంపు మూలాన్ని చూడటానికి అలవాటు పడితే మనస్సు అక్కడకు వెళ్ళి నశిస్తుంది, అప్పుడు సుఖసముద్రం పొంగుతుంది, ఎంత గొప్పగా పొంగుతుంది అంటే అసలు ఈ శరీరం ఉందో, లేదో నీకు తెలియదు, ఈ శరీరానికి మరణం వచ్చినా వాడికి తెలియదు, వాడు జీవన్ముక్తుడు. ఇప్పుడు చాలామందికి ప్రేమ ఎలా ఉంటుందో తెలియదు. అసలు ప్రేమ ఎలా ఉంటుందో తెలియకుండా జ్ఞానం మనకు ఎలా వస్తుంది. కలియుగంలో మనకు ప్రేమ అక్కరలేదు, జ్ఞానం ఎవరికి అక్కరలేదు. ఎవడికయినా జ్ఞానం ఉంటే, ఎవడికయినా శాంతి ఉంటే అది గుర్తించే శక్తి కూడా మనకు లేదు. మనం మంచి పనులు ఎలాగు చెయ్యలేము, ఎవరయినా మంచి పనులు చేస్తే అది చూసి సంతోషించే శక్తి కూడా మనకు లేదు, ఇది కలియుగం. మనం ప్రతీ పని గుర్తింపు కోసం చేస్తాము. గుర్తింపు కోరుతున్నాడు అంటే అక్కడ జీవుడు ఉన్నాడు, జీవుడు ఉన్నప్పుడు పునర్జన్మ వచ్చేస్తుంది. కెరటం ఎక్కడ నుండి వచ్చింది, సముద్రంలో నుండి వచ్చింది. కెరటంలో ఉన్నది నీరే, అయితే ఒక రూపం ఏర్పడింది కాబట్టి కెరటం అంటున్నాము. కెరటంలో ఉన్న నీరు, సముద్రంలో ఉన్న నీరు వేరుకాదు, రెండూ ఒక్కటే. అసలు దేవుడే జీవుడిగా కనిపిస్తున్నాడు. అందుచేత జీవుడికి సేవచేసేటప్పుడు అది దైవానికి సేవ చేస్తున్నాను అనుకొని చెయ్యాలి. ఇప్పుడు జనం ఎలా తయారయ్యారు అంటే వారిలో గొప్పతనం ఏమీ ఉండదు కాని బయట వారందరూ వారు గొప్పవారు అనుకోవాలి అనుకొంటున్నారు. నీలో ఏది లేదో అది నీలో ఉందని ఇతరులు అనుకోవాలి అని నీవు అనుకొంటున్నావు, ఇది ఏమి న్యాయం, ఇదా జ్ఞానం. నీలో గొప్పతనం లేదు, కాని ఇతరుల చేత నీలో గొప్పతనం ఉందని ఈ బుడ బుక్కల మాటలు అనిపించుకోవటం ఎందుకు? ఇలా నిన్ను నీవు వంచన చేసుకోవద్దు. అది అసహజస్థితి, దాని వలన నీకు శాంతి దొరకదు, సహజస్థితిని పొందలేవు.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | |
|---|---|
| 26-06-05 ఆది | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| 02-07-05 శని | చింతపర్రు సాయిబాబా మందిరం |
| 21-07-02 గురు | **గురుపౌర్ణమి**, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

*జగత్తు మనః ప్రసారితమని నిత్యము జ్ఞాపకముంచుకో, మనస్సు ఆత్మలోనిది. శరీరం యెక్కడెక్కడ సంచరించినా మనస్సును సంయమంలో ఉంచుకోడం అవసరం. శరీరం కదులుతుంది గాని ఆత్మ కదలదు. జగత్తంతా ఆత్మయందే ఉన్నది*

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**

## గ్రంథ ఆవిష్కరణము

సద్గురు శ్రీ నాన్నగారి ఇరువది రెండు సంవత్సరాల సుందరమైన సుమధురమైన ప్రవచనాల సారాన్ని 362 పేజీలలో "అమృత వాహిని" అనే నామంతో రూపుదిద్దుకొన్న గ్రంథాన్ని అర్థవరం గ్రామనివాసి సాగిరాజు రామకృష్ణంరాజుతో సంకలనము చేయబడినది. ఈ గ్రంథాన్ని ది॥ 26-06-2005 మధ్యాహ్నము గం॥ 2-00 లకు జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో సద్గురు శ్రీ నాన్నగారు ఆవిష్కరిస్తారు. సాధకులకు ఉపయుక్తమైన ఎన్నో విషయాలను 13 అంశాలతో ఈ గ్రంథంలో సమగ్రంగా, సమోన్నతంగా పొందుపరచటమైనది. దీని వెల రు॥ 60/-లు. పాఠకులు ఈ విషయాన్ని గమనించ కోరుతున్నాము.

# కలలు కళ్యాణ హేతువులు అవుతాయా?

బుద్ధుని జననానికి ముందు మాయావతి కలలో ఐరావతం చేసిన చేష్టలు, స్వప్న శాస్త్రపారంగతుల, భవిష్యత్‌వాణి చెప్పిన తీరులలాంటివి చరిత్రలో ఎన్నో ఉన్నాయి. స్వప్న ఫలితాలపై శ్రీ అరవిందులు ఎంతో విశ్లేషణ చేసారు. వాటినన్నిటినీ ప్రక్కన పెడదాము. మనలో ఎన్ని సంస్కారాలు ఉన్నాయో తెలియటానికి స్వప్నాలు ఎక్సరేలా ఎలా సహకరిస్తాయో శాస్త్రీయంగా విశ్లేషిద్దాము. మాయ మనలోనే పుట్టి మన సహాయంతోనే మనలను భ్రాంతింప చేస్తుందని వేదంలో సోమదత్తుని తండ్రి కథ ఉదాహరణ "సన్యాసం తీసుకోదలచిన ఆ బ్రహ్మచారి యాత్రలో గంగ ఒడ్డున ఉన్న చెట్టు క్రింద సన్నని రాతిఫలకంపై భోజనం చేసి పరుండి విశ్రాంతి తీసుకొంటూ ఉండగా అందమైన యువతి నీళ్ళబిందెతో కదిలే దృశ్యాన్ని అతని మనస్సులో ముద్రవేసింది. నిద్రలో కలలో ఇలా తలచాడు "ఆమెను వివాహం చేసుకొని పొలం సంపాదించి ఇల్లు కడతాను, నా భార్య పండంటి బిడ్డను కంటుంది. ముగ్గురం మంచం మీద పడుకొన్నాము. బిడ్డ మధ్యలో ఉన్నాడు. భార్యతో బుడతడు నలిగిపోతున్నాడు కాస్త అటు జరుగు అంటే ఆమె అయ్యోరామ నాకు జాగాలేదు మీరే జరగండి' అంది. 'సరేలే, నేనే జరుగుతాను హు-హు-హు అని జరిగి రాతిఫలకం అంచునుంచి గంగలోకి పడి మునిగాడు. గంగామాత చల్లని పవిత్ర స్పర్శతో మేలుకొని ఒడ్డుకు చేరాడు. దీక్ష మంచిదే కాని సంస్కారాలు పతనం చేసాయి. అలాగే మన జీవితంలో అజ్ఞానమనే నిద్రలో మన ఆశలు, చేతల పతనాలు అలాగే ఉన్నాయి. వాటిని గురువు మాటలను విని, వారి సహాయంతో మన వాసనలను నిర్మూలించుకొని తరించాలి. మహాత్మునికి తల్లిని చంపిన కల వచ్చింది ఆరా తియ్యగా అంతకు ముందురోజు వంటవాడు వండిన ఆహారమని తేలింది. వంటవాడు పూర్వం తల్లిని హత్య చేసాడు. మన ఆహార, విహారాలలో ఎలా ఉండాలో ఆకల ఒక సంకేతం. శ్రీనాన్నగారు "నాకు ఒకరోజున స్వప్నం వచ్చింది. బిక్షకుడికి బియ్యం వేస్తూ ఉండగా శంకరులు ప్రత్యక్షమై 'ఆ ఇచ్చే నీవు ఆ పుచ్చుకొనే వాడు యదార్థమా?' అంటే అది స్వప్నమే అన్నాను. ఆ స్వప్నాన్ని నేను సాక్షిగా చూచాను" అన్నారు. "ఉన్న పరమార్థం ఒక్కటి అంటే ఒక్కటే. రెండవది అంటూ లేదని" చాందోగ్యోపనిషత్ చెప్పింది. ఇచ్చేవాడు దైవమే, తీసుకొనేవాడు దైవమే ఇది గ్రహిస్తే వేరుబుద్ధి నశిస్తుంది.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం